7

సాక్షి
చిత్తూరు

మంగళవారం ၊ 4 ၊ ఫిబ్రవరి ၊ 2025




భక్తిశ్రద్ధలతో మహాసరస్వతి యాగం

వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం మహాసరస్వతి యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. - 8లో



కదిలిస్తే.. కన్నీరే

నగరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబాల్లో ఎవరిని కదిలించినా కన్నీరు మున్నీరవుతున్నారు. - 8లో



19 నుంచి లక్ష కుంకుమార్చన

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు లక్షకుంకుమార్చన జరుగుతుందని ఈఓ తెలిపారు.



బస్సులో నుంచి మేయర్ శిరీషాను కిందకు దిగకుండా అడ్డుకుంటున్న కూటమి నేతలు



బస్సులో నుంచి కారుల్లోకి ఎక్కుతున్న కార్పొరేటర్లు



కూటమి నేతల అరాచకాలతో భయాందోళనకు గురవుతున్న కార్పొరేటర్లు



కార్పొరేటర్ల బస్సు అద్దాలు ధ్వంసం చేస్తున్న కూటమి గూండాలు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన కార్పొరేటర్లు, నేతలు



ధ్వంసమైన కెమెరాను చూపుతున్న ఫొటో గ్రాఫర్



ఫోన్లు లాక్కుంటున్న టీడీపీ రౌడీలు



భూమన అభినయ్‌ని అడ్డుకుంటున్న పోలీసులు

తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి గూండాలు రెచ్చిపోయారు. బలం లేని చోట బలగాన్ని వెంటబెట్టుకుని అరాచకానికి ఒడిగట్టారు. ఓటేయడానికి బస్సులో వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. మహిళా కార్పొరేటర్లపై అమానవీయంగా వ్యవహరించారు. కొందరు కార్పొరేటర్లను బలవంతంగా లాక్కొచ్చి కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. జర్నలిస్టులపైనా దాడికి తెగబడ్డారు. పోలీసులు, అధికారుల సమక్షంలోనే ఎస్వీయూ ప్రాంగణంలో రణరంగం సృష్టించారు. తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడేలా చేశారు.



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సును చుట్టుముట్టిన కూటమి గూండాలు

గూండా రాజ్యం!

- రణరంగంగా తిరుపతి నగర డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక
- విధ్వంసం సృష్టించిన కూటమి నేతలు
- డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక నేటికి వాయిదా
- దాడులకు తలొగ్గని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- ఎస్వీయూలో కూటమి రౌడీల హల్‌చల్
- అధికార పార్టీకి సహకరించిన పోలీసులు, అధికారులు

తిరుపతి తుడా, తిరుపతి సిటీ: తిరుపతి నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక రణరంగంగా మారింది. బెదిరింపులు, దాడులు, కిడ్నాప్‌ల మధ్య కోరం లేక మంగళవారానికి వాయిదా పడింది. ఎస్వీ యూనివర్సిటీ వేదికగా సోమవారం నగర డెప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేపట్టారు. అయితే ఎస్వీయూ ప్రాంగణంలో కూటమి నేతల అరాచకాలతో హైడ్రామా నడిచింది. ఎన్నికల అధికారులు విధించిన నిబంధనలు కూటమి నేతలకు వర్తించ లేదు. వర్సిటీ ప్రాంగణం టీడీపీ, జనసేన నేతలతో నిండిపోయింది. వైఎస్సార్‌సీపీ నేతలకు అడుగడుగునా తనిఖీలు తప్పలేదు. ఉదయం 6 గంటల నుంచే యూనివర్సిటీ పోలీసుల చక్రబంధంలోకి వెళ్లింది.

కూటమి దౌర్జన్య కాండ

డెప్యూటీ మేయర్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటి నుంచి ఉదయం 9.55 గంటలకు బయలు దేరారు. ప్రత్యేక వాహనంలో వస్తున్న కార్పొరేటర్లు ఎస్వీయూ రెండో గేటు వద్దకు చేరుకోగానే కూటమి నేతలు అడ్డుకున్నారు. అక్కడే ముందుగా తిష్టవేసిన 300పైగా రౌడీమూకలు ఒక్కసారిగా చుట్టుముట్టారు. బస్సు చక్రాలకు గాలితీశారు. వాహన అద్దాలను ధ్వంసం చేశారు. దాడులతో ఉలిక్కిపడ్డ మహిళా కార్పొరేటర్లు భయాందోళనకు గురయ్యారు. రౌడీ మూకల అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. వాహనంలోకి చొరబడి కార్పొరేటర్లపై పిడిగుద్దులు గుద్దుతూ తిట్ల దండకం అందుకున్నారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, బోకం అనిల్, అనీష్‌రాయల్, మోహన్ క్రిష్ణయాదవ్‌పై దాడులకు దిగారు. ఆపై సిద్ధంగా ఉన్న కూటమి నేతల వాహనాల్లో వారిని ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. మిగిలిన కార్పొరేటర్లలో ఐదుగురిని కొట్టుకుంటూ వాహనాల్లో ఎక్కించారు. మహిళా కార్పొరేటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు.

అంతా పోలీసుల సమక్షంలోనే

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు వస్తున్న వాహనంపై విధ్వంసం, దాడులు, కిడ్నాప్‌లు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. టీడీపీ, జనసేన నేతలు గుమిగూడి, నానా హంగామా చేస్తున్నా పట్టించుకోలేదు. పోలీసుల సమక్షంలోనే కార్పొరేటర్ల కిడ్నాప్‌లు చేసినా చూసీచూనట్టు వదిలేశారు.

ఎన్నిక నిర్వహణలో విఫలం

కార్పొరేషన్ ఎన్నికల్లో ఒకే ఒక్క డివిజన్‌ను టీడీపీ గెలుచుకుంది. 48 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. ఒక్క కార్పొరేటర్‌తో కూటమి ప్రభుత్వం డెప్యూటీ మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని చేస్తున్న కుయుక్తుల పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డెప్యూటీ మేయర్ ఎన్నికను సకాలంలో నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

వర్సిటీలో రౌడీల హల్‌చల్

పోలీసులు ఎస్వీయూ ప్రాంగణాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. 144 సెక్షన్ విధించారు. పాస్‌లు పేరుతో హడావుడి సృష్టించారు. అయితే ఇవన్నీ ప్రతిపక్ష పార్టీకి మాత్రమే పోలీసులు వర్తింపజేశారు. టీడీపీ, జనసేన నాయకులు వందలాది మంది ఎన్నిక జరిగే భవనం ముందు తిష్టవేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్ తన అనుచరులతో వర్సిటీ ప్రాంగణంలో హల్‌చల్ చేశారు. టీడీపీ, జనసేన నేతలకు ఎన్నికల అధికారులు విచ్చల విడిగా పాస్‌లు ఇచ్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ నాయకుడు నరసింహయాదవ్ పోలీసులను బెదిరిస్తూ కౌన్సిల్ హాల్‌లోకి వెళ్లడం గమనార్హం.



కార్పొరేటర్ సోదరుడ్ని తీసుకెళ్తున్న అభినయ్

బలవంతంగా వీడియోలు విడుదల

కిడ్నాప్‌కు గురైన కార్పొరేటర్లపై దౌర్జన్యం చేసి వారి నుంచి బలవంతంగా వీడియోలను చేయించి విడుదల చేయించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ రాజమ్మను స్పష్టంగా కిడ్నాప్ చేసిన దృశ్యాలు ఉన్నాయి. కానీ అన్నా అనిత కిడ్నాప్ కాలేదని వీడియో చేసి మీడియాకు విడుదల చేశారు. అలానే యూనివర్సిటీ వద్ద ఐదుగురు కార్పొరేటర్లను కిడ్నాప్‌చేసి ఒకరిని విడుదల చేశారు. నలుగురు కార్పొరేటర్లను ఫామ్ హౌజ్‌లో పెట్టి తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఇళ్లవద్దే ఉన్నామని వీడియోలు చేయించి విడుదల చేశారు. ఈ వీడియోలు బలవంతంగా చేశారనే విషయం తేటతెల్లమవుతోంది. ఈ కుట్ర వెనుక అన్నా రామచంద్రయ్య హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రలోభాలకు తలొగ్గని కార్పొరేటర్లు

డెప్యూటీ మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు ఏకంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ రంగంలోకి దిగారు. గడిచిన ఐదు రోజులుగా తిరుపతిలో తిష్టవేసి రాజకీయాలు నడిపించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లను లొంగదీసుకునేందుకు బెదిరింపులకు దిగారు. లొంగకపోవడంతో ఆస్తుల ధ్వంసానికి తెగబడ్డారు. ఈ క్రమంలో ముగ్గురు కార్పొరేటర్లు కూటమి పంచన చేరాల్సి వచ్చింది. అయితే మిగిలిన కార్పొరేటర్లు టీడీపీ, జనసేన నేతల ఒత్తిళ్లు, దాడులకు తలవంచ లేదు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ బలాన్ని తగ్గించేందుకు కిడ్నాప్‌లకు తెరలేపారు. ఉదయం 8 నుంచి 21వ డివిజన్ కార్పొరేటర్ రాజమ్మ ఇంటి వద్ద టీడీపీ నాయకులు దిష్ట వేశారు. అన్నా రామచంద్రయ్య, కార్పొరేటర్ అనిత, టీడీపీ నేతలు కోడూరు బాల సుబ్రమణ్యం, బుల్లెట్ రమణ ఆమెను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయా రు. ఆపై ఆమె తిరిగి వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. అలాగే మరింత మంది కార్పొరేటర్ల ఇళ్లకు వెళ్లి దౌర్జాన్యాలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మెజారిటీ కార్పొరేటర్లు కౌన్సిల్‌లోకి వెళ్లేందుకు నిరాకరించి నిరసనకు దిగారు.



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కారులో కిడ్నాప్ చేస్తున్న కూటమి నేతలు



కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న కూటమి రౌడీలు



ఎస్వీయూలో అరాచకం చేస్తున్న అన్నా రామచంద్రయ్య, కూటమి గూండాలు



ఎస్వీయూ గేటు వద్ద హల్‌చల్ చేస్తున్న టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాసులు



బస్సులో నుంచి బలవంతంగా కార్పొరేటర్లను కారులోకి ఎక్కిస్తున్న కూటమి నేతలు



తన నివాసంలో కార్పొరేటర్లు, నేతలతో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



ఎస్వీయూకు వస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్, కార్పొరేటర్లు



కార్పొరేటర్లను కారులోకి ఈడ్చుకెళ్తున్న కూటమి నేతలు



భూమన నివాసం నుంచి బయల్దేరుతున్న కార్పొరేటర్లు



బస్సు దిగి ఎస్వీయూ సెనేట్ హాలుకు వెళ్తున్న ఎంపీ గురుమూర్తి

చట్టపరంగా ముందుకు వెళతాం



తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో చోటుచేసుకున్న దౌర్జన్యాలు, దాడులు, కిడ్నాప్ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నాం. ఇప్పటికే మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాం. అలాగే టీడీపీ, జనసేన నేతలు సృష్టించిన అరాచకంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

– డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

ప్రజాస్వామ్యం అపహాస్యం



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి ఉంచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. తిరుపతి కార్పొరేషన్‌లో గతంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేయడం దుర్మార్గం. సాధారణ ఎన్నికల్లో ప్రజాస్వామ్య బద్ధంగా గెలవలేదనిపిస్తోంది.

కే.నారాయణస్వామి, మాజీ డెప్యూటీ సీఎం

ప్రజాస్వామ్యం ఖూనీ



తిరుపతిలో కూటమి పార్టీల అరాచకాలతో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష నగరపాలక ప్రత్యేక సమావేశాలకు వెళ్లలేని దుస్థితి ఎదురైంది. తిరుపతిలో కూటమి పార్టీల అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నా.

– ఆర్కే రోజా, మాజీ మంత్రి

మహిళలంటే గౌరవం లేదా?



మహిళల పట్ల అధికార పార్టీ నేతలకు గౌరవం లేదు. మహిళా కార్పొరేటర్ల పట్ల టీడీపీ, జనసేన నేతలు అగౌరవంగా వ్యవహరించారు. మంచి మర్యాదలను విడిచి రాజకీయాలను చేస్తున్నారు. బలం లేకుండానే గెలవాలని చూడడం అప్రజాస్వామికం. ఇది మంచిది కాదు.

– డాక్టర్ శిరీష, తిరుపతి కార్పొరేషన్ మేయర్

ప్రజలు గమనిస్తున్నారు



తిరుపతిలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. కార్పొరేటర్ల ఆస్తులను ధ్వంసం చేయడం అమానుషం. ప్రలోభాలకు లొంగని వారిపై దాడులకు దిగుతున్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

– డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

కూటమి అరాచకాలు



తిరుపతిలో ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యంలో మంచిదికాదు. ఈ చర్యలను ఖండిస్తున్నా. కూటమి నేతల దుశ్చర్యలను ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు.

– నూకతోటి రాజేష్, సత్యవేదు సమన్వయకర్త

అసత్య ఆరోపణలు చేస్తే సహించం

పుంగనూరు: పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దిన్‌షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ నాగబాబు పబ్లిసిటీ కోసం పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని, ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాగబాబు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. పెద్దిరెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రెండు లక్షల కోట్లు సంపాదించారని నాగబాబు చెప్పడం బాధాకరమన్నారు. అలాగే అటవీ భూములు ఆక్రమించుకున్నారని ఆరోపణలు చేయడం హాస్యస్పదమన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ మీటింగ్‌ల్లో ఆరోపణలు చేయడం పబ్లిసిటీ కోసమేనన్నారు. వీటిపై తగిన ఆధారాలను చూపగలరా? అంటూ రెడ్డెప్ప సవాల్ విసిరారు. నాగబాబు చెప్పిన నిజనిర్ధారణ కమిటీని పెద్దిరెడ్డి కుటుంబంతో సహా అందరు స్వాగతిస్తామని, నిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. అటవీ భూములు కబ్జా చేయలేదని, ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసిన భూములపై నాటి తెలుగుదేశం ప్రభుత్వమే ప్రైవేటు భూములుగా గుర్తించిందని మాజీ ఎంపీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేసి ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో పెద్దిరెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేసి, అవి రుజువు కాకపోవడంతో 7 నెలలుగా ప్రభుత్వం మౌనం దాల్చిందన్నారు. అలాగే ప్రస్తుతం మద్యం సరఫరాలో ఎంపీ మిథున్ రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని నాగబాబు ఆరోపించడం బాధాకరమన్నారు. ఎలాగైనా పెద్దిరెడ్డి కుటుంబాన్ని కేసుల్లో ఇరికించి వారిని ఇబ్బందులకు గురిచేసేందుకు కూటమి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులను కుక్కలతో పోల్చడం నాగబాబుకు తగదన్నారు. అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేసే అర్హత నాగబాబుకు లేదని రెడ్డెప్ప దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో సూపర్–6 అమలు చేస్తామని అధికారంలోకి రాగానే ఒక్క హామీ కూడా నేరవేర్చలే దన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఖాదర్, విజయకుమార్, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, చిత్రంలో భాస్కర్‌రెడ్డి, అలీమ్‌బాషా

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


ద్విచక్ర వాహనాలతోపాటు దొంగల ముఠాను అరెస్టు చూపుతున్న పోలీసులు

కుప్పం: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కుప్పం పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కుప్పం రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ మల్లేష్ యాదవ్ ఈ వివరాలను వెల్లడించారు. శాంతిపురం మండలంలో గతవారం ద్విచక్రవాహనాల వరుస చోరీలు జరిగాయి. దీనిపై స్పందించిన పోలీసుశాఖ ప్రత్యేక పోలీసు బలగాలతో దర్యాప్తు చేపట్టింది. పోలీసులు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి, హోసూరు పట్టణాలకు చెందిన నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 8 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయినా వారిలో కృష్ణగిరికి చెందిన సికిందర్, సేటు, సాదుల్లా, హోసూరుకు చెందిన యారబ్ ఉన్నట్లు సీఐ తెలిపారు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, రాళ్లబూదుగురు ఎస్ఐ నరేష్, గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు


బంగారుపాళెంలో క్యూలో వేచిఉన్న రైతులు

బంగారుపాళెం: రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. రబీ సీజన్ మొదలైనా ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సోమవారం మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా కోసం రైతులు ఎండలో క్యూలో నిలబడి కొనుగోలు చేశారు. ఆధార్ కార్డుకు ఒక బస్తా చొప్పున విక్రయించారు. దుకాణానికి 30 టన్నుల యూరియా వచ్చింది. యూనియా బస్తా రూ.270 విక్రయించారు. రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు ఎరువులు రాలేదన్నారు. దీంతో రైతులు వ్యయ ప్రయాసాలకోర్చి మండల కేంద్రానికి వచ్చి ఇలా ఎండలో నిలుచుకుని పడికాపులు పడి యూరియా గొనుగోలు చేయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందేవని ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడంలేదని పలువురు రైతులు వాపోయారు రైతుభరోసా నగదు కూడా అందించకపోవడంతో కష్టాల సేద్యం తప్పడంలేదన్నారు.

తమిళనాడుకు వెళ్లిన ఏనుగులు


పానాటూరులో ధ్వంసం చేసిన అరటి తోటను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గుడిపాల: ఏనుగులను ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు తమిళనాడు వైపునకు మళ్లించారు. చిత్తపార, పానాటూరులో ఆదివారం రాత్రి అరటి, బొప్పాయి పంటలను రెండు ఏను గులు నాశనం చేశాయి. మొదట్లో ఒంటరి ఏనుగు మాత్రమే ఉందని అటవీశాఖ అధికారులు తెలియజేయగా సోమవారం తెల్లవారుజామున రెండు ఏనుగులు ఉన్నట్లు గుర్తించారు. అడవిలో బాణసంచా పేల్చడంతో తమిళనాడు వైపునకు వెళ్లినట్లు వారు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని డీఆర్వో ఆనంద రెడ్డి, పారెస్ట్ బీట్ ఆఫీసర్ డిల్లీరాణి తెలిపారు.

కదిలిస్తే.. కన్నీరే

కుమార్తెను చూడదానికి వస్తూ..



తిరుత్తణికి చెందిన కుమార్ కంసాలిగా పనిచేస్తున్నాడు. ఈయన కుమార్తెకు వివాహం కాగా పుత్తూరు పట్టణంలో నివాసం ఉంటోంది. కుమార్తెను చూసి ఉదయాన్నే వచ్చేస్తానంటూ తిరుత్తణి నుంచి రాత్రి ప్రైవేటు బస్సు ఎక్కాడు. ఎక్కిన సమయంలో సీటు లేకపోవడంతో నిలబడే ప్రయాణించాడు. నగరికి వచ్చాక సీటు దొరకడంతో కిటికీ పక్కనే కూర్చున్నాడు. హఠాత్తుగా జరిగిన ప్రమాదంలో కుమార్తెను చూడకుండానే అశువులుబాసాడు.

గృహప్రవేశానికి వెళ్లి వస్తూ..



తిరుపతి, నెహ్రూనగర్‌కు చెందిన మణిగండన్ కుమారుడు ధనుష్ అనే ఏఎం ధనుష్ కోటి తన తల్లి సెల్వితో పాటు తమిళనాడు శోళింఘర్‌లో జరిగిన బంధువుల గృహ ప్రవేశ వేడుకలకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరుత్తణికి చేరుకున్న వారు తిరుపతికి వెళ్లే ప్రైవేటు బస్సు ఎక్కారు. కిటికీ పక్కనే సీటు కావాలంటూ ధనుష్ అక్కడ కూర్చున్నాడు. అతని తల్లి పక్కనే కూర్చుంది. జరిగిన ప్రమాదంలో వీరు కూర్చున్న సీటు వద్దే భారీ వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా ధనుష్ రెండోవాడు.


మృతదేహాల అప్పగింతకు ఆస్పత్రి వద్ద అధికారులు

ఊరెళ్లి వస్తారనుకున్న వారు తిరిగి రాలేదు.. రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకానికి వెళ్లిపోయారంటూ హఠాత్తుగా వచ్చిన వార్త వారిని కలచివేసింది. పలువురిని బలిగొన్న రాజీవ్‌నగర్ టూ రామాపురం మార్గం మరో నలుగురిని బలికొంది. వారి కుటుంబసభ్యులతోపాటు అయినవాళ్లందరూ శోక సముద్రంలో మునిగిపోయారు. చివరిచూపులైనా చూసుకుందామంటూ సోమవారం ఉదయాన్నే ఆస్పత్రి వద్దకు పరుగులు తీశారు. మృతులతో తమకున్న అనుబంధాలను తలచుకుంటూ కన్నీరుమున్నీరై విలపించారు. నగరి ఏరియా ఆస్పత్రి ఆవరణలు ఆర్తనాదాలతో నిండిపోయింది. ఎవరిని కదిలించినా కన్నీరే సమాధానం చెప్పింది. – నగరి

- ఆస్పత్రిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు
- పోస్టుమార్టం అనంతరం మృతదేహాల అప్పగింత
- రాజీవ్‌నగర్ టు రామాపురం ప్రమాదాలకు నిలయం
- తరచూ రక్తసిక్తమవుతున్న రోడ్డు


ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబసభ్యులు, బంధువులు

గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఆర్డీఓ భవానీశంకరి, డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్, తహసీల్దార్ రవికుమార్, సీఐ మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి ఆస్పత్రికి విచ్చేసి క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఢీకొన్న వాహనం కోసం పోలీసులు విచారణ మొదలుపెట్టారు.

రాజీవ్‌నగర్ టు రామాపురం ప్రమాదాలకు నిలయం

జాతీయ రహదారిలో నగరి నుంచి పుత్తూరుకు వెళ్లే మార్గంలో రాజీవ్‌నగర్ టు రామాపురం ప్రమాదాలకు నిలయమవుతోంది. తరచూ ఈ ప్రాంతంలో జరిగే ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

- ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే నాలుగేళ్ల కిందట తమిళనాడు ఆర్టీసీ బస్సును లారీ సైడ్ నుంచి ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు.
- నాలుగేళ్ల కిందట తమిళనాడు, చెన్నై పల్లవన్ తాంగళ్‌కు చెందిన వారు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి ఓమ్ని వాహనంలో తిరుగు ప్రయాణంలో ఉండగా ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.
- ఏడాది కిందట సింగపూర్ నుంచి తిరుమల దర్శనానికి వచ్చి తిరిగే వెళ్లే సమయంలో కనంమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.
- 2023 సెప్టెంబర్ 8న మున్సిపల్ పరిధిలోని ధర్మాపురం వద్ద జరిగిన భారీ రోడ్డు ప్రమాదంలో నగరి మిట్టపాళేనికి చెందినవారు, జాతీయ రహదారి పనులు చేసేవారు ఆరుగురు మృతి చెందారు.
- 2024 అక్టోబర్ 28న సిమెంటు ట్యాంకర్ ఢీకొని నింద్ర మండలం ఇరుగువాయికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి మృతి చెందాడు.

ఈ ప్రమాదాల్లో అధిక సంఖ్యలో జరిగిన ప్రమాదాలు రాత్రిపూటే జరిగాయి. రాత్రిపూట వెలుతురు లేకపోవడం, సూచికలు లేకపోవడం, వాహనాలు ఎక్కువ సంఖ్యలో తిరుగుతున్నా రెండే లేన్ల రోడ్డు మాత్రమే ఉండటమే ప్రమాదానికి కారణమని పలువురు చెబుతున్నారు.

వివాహానికి వెళ్లి తిరిగివస్తూ..


పార్థసారథి నాయుడు(ఫైల్)


రాజేంద్ర నాయుడు(ఫైల్)

పార్థసారథి నాయుడు, రాజేంద్ర నాయుడు ఇద్దరు వడమాలపేట మండలం సీతారామాపురం గ్రామానికి చెందినవారు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు బంధువులు కావడంతో అడపాదడపా బంధువుల శుభకార్యాలకు కలిసే వెళుతుంటారు. ఇలా ఆదివారం రాత్రి తిరుత్తణిలో జరిగిన బంధువుల వివాహ రిసెప్షన్‌కు వెళ్లారు. వధూవరులను ఆశీర్వదించి, భోజనం చేసి తిరుత్తణి నుంచి ప్రైవేటు బస్సు ఎక్కారు. వెనక పక్కే సీటు ఖాళీగా ఉండడంతో అక్కడ కూర్చున్నారు. అదే వారికి శాపంగా మారింది. వారు కూర్చున్న సీటు వద్దే వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. తమ ఇళ్లకు వెళ్లేందుకు కలిసి ప్రయాణం చేసిన వారికి అదే చివరి ప్రయాణం అయ్యింది. దీంతో సీతారామాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతుల కుటుంబాలకు సంతాపం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు మాజీ మంత్రి ఆర్కే రోజా తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలన్నారు. క్షతగాత్రులకు ఉన్నత వైద్యసేవలు అందించాలన్నారు. తిరుత్తణి నుంచి తిరుమలకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయని రెండే లేన్ల రోడ్డు ఉండటంతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నాలుగులేన్ల రోడ్డుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం అందించిన మేరకు ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్డు నిర్మాణం తరువాత ప్రమాదాల సంఖ్య తగ్గుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా సరస్వతియాగం


సరస్వతీదేవికి పూజలు చేస్తున్న అర్చకులు


యాగంలో పాల్గొన్న విద్యార్థులు

కాణిపాకం: వసంత పంచమిని పురస్కరించుకుని కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆస్థాన మండపంలో సోమవారం మహా సరస్వతి యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 2,500 మంది ఈ యాగంలో పాల్గొన్నారు. వేదపండితులు సరస్వతీదేవికి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం మహా సర స్వతి యాగం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే మురళీమోహన్ పరీక్ష సామగ్రి, కంకణాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డీవైఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

వసంత పంచమిని పురస్కరించుకుని ఆలయ కల్యాణ వేదికపై సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 500 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలు, తల్లిదండ్రులతో ఆలయం సందడిగా కనిపించింది.

ముగిసిన బాలాలయ మహోత్సవం

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆవరణలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ బాలాలయ మహోత్సవం సోమవారంతో ముగిసింది. శ్రీవీరాంజనేయస్వామి దేవస్థాన పునర్నిర్మాణంలో భాగంగా ఈ మహోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా విశ్వరూప దర్శనం, యాగశాల ఆరాధన, హనుమంత సేవ, ప్రాయశ్చిత్త హోమం, మహా పూర్ణాహుతి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ పనులను యూఎస్ఏకు చెందిన అనిల్ రూ.1.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు.


హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

పచ్చికాపల్లంలో దొంగనోట్ల కలకలం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో దొంగనోట్లు విచ్చలవిడిగా చలామణి అవుతున్నాయి. అక్షరజ్ఞానం లేని చిరు వ్యాపారులను నకిలీ నోట్ల ముఠా నమ్మించి, దోపిడీకి పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండలంలోని పచ్చికాపల్లంలో సోమవారం రూ.500 నకిలీ నోట్లు కలకలం రేపాయి. స్థానికుల కథనం మేరకు...మండలంలోని పచ్చికాపల్లంలో బొమ్మన్‌దొడ్ల గ్రామానికి చెందిన ఓ మహిళ పూలు, పండ్ల వ్యాపారం చేస్తోంది. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు అంగడి వద్దకు కారులో వచ్చారు. పూలు, పండ్లు తీసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు రెండు రూ. 500 నోట్లను వ్యాపారికి ఇచ్చి అక్కడి నుంచి జారుకున్నారు. అయితే కొంతసేపటికే ఆ నోట్లను వేరే వారికి ఇవ్వగా ఆ రెండు దొంగనోట్లు నకిలీ వని తేలింది. దీంతో ఆ చిరు వ్యాపారస్తురాలు లబోదిబోమంది. రూ. వెయ్యి నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. చెన్నై, కర్ణాటక నుంచే దొంగనోట్ల ముఠా నకిలీ నోట్లను తెచ్చి ఇలా చేతులు మార్చుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.


నకిలీ రూ. 500 నోటు

టాటాఏస్ బోల్తా.. ఒకరి మృతి

- ముగ్గురి పరిస్థితి విషయం
- 17 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులు రెండు గంటలపాటు రోడ్డుపైనే నరకయాతన
- వైద్యం అందించిన స్థానిక వైద్యులు


వెంకటేష్ మృతదేహం


రోడ్డుపైనే చికిత్స చేస్తున్న వైద్యులు

శ్రీరంగరాజపురం : టాటా ఏస్ వాహనం టైరు పేలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా మరో 17 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం శ్రీరంగరాజపురం మండలంలోని మెదవాడ ఎస్టీ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పాతపాళెం దళితవాడ గ్రామానికి చెందిన సుమారు 20 మంది టాటా ఏస్ వాహనంలో గంగాధరనెల్లూరు మండలం ఎట్టేరి వద్ద ఓ ప్రైవేటు కార్యక్రమానికి బయలుదేరారు. మార్గం మధ్యలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో మెదవాడ ఎస్టీ కాలనీ వద్ద టాటా ఏస్ టైర్ పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ (35) అక్కడిక్కడే మృతి చెందాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషయంగా ఉంది. 17 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయం గుర్తించిన స్థాని కులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే ప్రయ త్నం చేశారు. తక్షణమే కొందరిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో 108 వాహనానికి ఫోన్ చేసినా సకాలంలో రాకపోవడంతో కొందరు క్షతగాత్రులు తల్లడిల్లిపోయారు. ఆగ్రహించిన స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు రోడ్డుపైనే బైఠాయించారు. స్పందించిన స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ప్రమాదస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు రోడ్డుపైనే వైద్యం అందించారు.

కూటమి నేతలు దౌర్జన్యం చేస్తున్నారు

- వైఎస్సార్‌సీపీకి ఏజెంట్‌గా ఉన్నానని తప్పుడు కేసులు
- ఎగువకామినేని గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడి ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'కూటమి నేతలు దౌర్జన్యం చేస్తున్నారు.. వైఎస్సార్‌సీపీకి ఏజెంట్‌గా ఉన్నానని నాపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారు. పోలీసులతో రౌడీ షీటర్ తెరుస్తామని బెదిరిస్తున్నారు. భూ సమస్యను తెచ్చి పెట్టి కక్ష సాధింపులకు దిగుతున్నారు.'అని చిత్తూరు జిల్లా ఐరాల మండలం ఎగువ కామినేని గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ఐరాల మండలం పుత్రమది రెవెన్యూ గ్రామపరిధిలో 38 సెంట్ల భూమి ఉందన్నారు. ఈ భూమి తనతో పాటు నాగరాజు, నాగరత్నం, పురుషోత్తం నాయుడు, హేమారెడ్డి అనే వ్యక్తులకు సంబంధించిందని తెలిపారు. ఇందులో 5 సెంట్ల భూమి టీడీపీ నేత చౌదరినాయుడుకు ఉందని, దీని అదునుగా చేసుకుని 38 సెంట్ల భూమిని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపించారు. ఇప్పుడు ఆ పొలం చుట్టూ కంచె వేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే ఆ టీడీపీ నేతతో పాటు హరిబాబునాయుడు, తులసిబాబు, నాగేశ్వర్‌రావు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా పనిచేశాడని ప్రచారం చేస్తూ.. తప్పుడు కేసులు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆ టీడీపీ నేత చెప్పినట్లు ఎస్ఐ తనపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, రౌడీ షీటర్ తెరుస్తానన్ని బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. ఎస్పీ న్యాయం చేయాలని కోరారు. దీనిపై ప్రజావేదికలో ఫిర్యాదు చేసినట్లు బాధితులు వివరించారు.

సమస్యలు పరిష్కరించండి సారూ!

చిత్తూరు కలెక్టరేట్ : తమ సమస్యలు పరిష్కరించండి సారూ..అంటూ ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికారులకు తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 226 అర్జీలను ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అర్జీదారు

ఫెన్సింగ్ తొలగించాలి


ఫెన్సింగ్ తొలగించాలని కోరుతున్న పాతబస్టాండ్ దుకాణదారులు

జిల్లా కేంద్రంలోని కాసు బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండ్‌కు వేసిన ఫెన్సింగ్‌ను వెంటనే తొలగించాలని దుకాణ యజమానుల సంఘం నాయకులు హరి, రమేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చాక పాతబస్టాండ్‌కు ఫెన్సింగ్ వేశారన్నారు. పేదల పొట్ట కొట్టేలా ఇలాంటి ఫెన్సింగ్‌లు వేయడం ఏమిటని ప్రశ్నించారు.

పట్టాలు ఇప్పించండి సారూ!



పట్టాలు ఇప్పించండి సారూ అంటూ సోమల మండలం ముచ్చుకాల్వ యానాది కాలనీకి చెందిన రాజశేఖర్, ఉమాపతిలు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

భూముల్లోకి రానీయలేదు



భూముల్లోకి రానివ్వకుండా అడ్డుకుని బెదిరిస్తున్నారని చౌడేపల్లి దిగుపల్లి పంచాయతీ మోట్లపల్లి యానాది కాలనీకి చెందిన వరలక్ష్మి, ధనలక్ష్మి వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మరమ్మతు పనులు అడ్డుకుంటున్నారు

జిల్లా కేంద్రంలోని మండివీధిలో ఉన్న హజరత్ ఏక్తాదర్ అలీఖాన్ షాహీది దర్గా శ్మశానవాటిక ప్రహరీ గోడ మరమ్మతు పనులను అడ్డుకుంటున్నట్లు కమిటీ అధ్యక్షుడు షేక్‌కరీముల్లా హుసేన్ తెలిపారు. ఈ మేరకు ఆ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్తూరు తహసీల్దార్‌ను ఆదేశించారు.


చర్యలు తీసుకోవాలంటున్న కమిటీ సభ్యులు

మొగిలి ఘాట్‌లో వాహనాల ఢీ


ఢీకొన్న వాహనాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లో సోమవారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మూడు వాహనాలు ఒకదానిని ఒక్కటి ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. సీఐ కథనం మేరకు.. బంగారుపాళెం మండలంలోని మొగిలి దొరచెరువు వద్ద జాతీయ రహదారిపై గంగవరం నుంచి చిత్తూరు వెళుతున్న టిప్పర్‌ను బెంగళూరు నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ వెనుక నుంచి ఢీ కొంది. టిప్పర్ ముందు వెళుతున్న కారును ఢీకొంది. దీంతో కారు ఎడమ వైపు నుంచి డివైడర్‌ను దాటి కుడిపక్కకు దూసుకు వెళ్లింది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కారును ఢీకొని ఉంటే కారులో ప్రయాణిస్తున్న వారికి పెనుప్రమాదం జరిగి ఉండేది. ముందు జరుగుతున్న ప్రమాదాన్ని గమనించి వాహనచోదకులు వాహనాలను నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో గంగవరం మండలం మర్రిమాకులపల్లెకు చెందిన టిప్పర్ డ్రైవర్ శ్రీనివాసులు, తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ చిట్టిబాబు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న తిరుపతి నగరం కాటన్‌మిల్‌కు చెందిన ఆర్ముగం, లలితకుమారి సురక్షితంగా బయటపడ్డారు. కారు దెబ్బతినింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన డ్రైవర్లను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంటైనర్ డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడంతో ముందు వెళుతున్న వాహనాలను ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.